# బాకీ బతుకులు

రెండు చేతులు దగ్గరకు తెచ్చి 'పబ్బతి' పట్టుకుని వెంకటయ్య వాకిట్లో భయం భయంగా నిలుచున్నాడు వీరయ్య. అతని పక్కనే అతని కొడుకు ఎనిమిదేళ్ళ దుర్గయ్య బిక్కుబిక్కుమంటూ చూస్తూ నిలుచున్నాడు. అరుగు మీదున్న పడక కుర్చీలో కూర్చున్న వెంకటయ్య బుర్ర మీసాలతో గంభీరంగా ఉన్నాడు.

"దండాలు పటేలా...!" వినయంగా నమస్కరించాడు వీరయ్య... ప్రతి నమస్కారం చేయకుండనే "ఏందిరా...?" అన్నాడు వెంకటయ్య... "ఏం లేదు పటేల...! నా బిడ్డ పోరి లగ్గానికి మీ దగ్గర నూరు రూపాయల బాకీ తీసుకున్నగద... గవ్వి కట్టన్నంటె నా నుంచిగాదు... మీరేమో తాపకోసారి మనషిని తోలవడ్తిరి... మేం జేసే కైకిలి బువ్వకే సరిపోతలేపాయె... ఏన్నుంచి తెచ్చి కట్టాలె బాంచెను...? రోజు రోజుకూ వడ్డీ పెరుగపట్టె..." అన్నాడు దీనంగా వీరయ్య...

"అయితే నన్నేం జెయ్యమంటవురా...?"

"ఏదన్న అమ్మిత్తామన్నా సారెడు భూమి లేకపాయె... గా తాటికమ్మల గుడిసొక్కటే మిగిలింది... నా పెండ్లాం మీన నల్లపూసలు తప్ప గురిజెత్తు బంగారం గూడ లేదు... ఇగెట్ల తేరుతది పటేల బాకీ...?"

"అయితే ఎగవెడుతనంటావా...? బాకీ తీసుకునేటప్పుడే గివ్వన్నాలో చించాలె... అప్పుడెక్కడికి పోయింది తెలివి...?"

"ఎప్పటికప్పుడే బాంచెను... బాకీ చెయ్యందేమో ఎల్లకపాయె... మీ బాకెందుకెగబెడ్త పటేల...! నా తోలొలిసి మీకు చెప్పులు కుట్టిచ్చైనా మీ బాకీ తీరుస్త..."

"నీ తోలు నాకెందుకు కాని, బాకెట్ల తీరుస్తవో చెప్పు...?"

"నేను బాగా లోచించిన పటేల...! ఎట్ల జేసినా బాకీ తీరది... అందుకోసం ఇగో నా కొడుకీడు... పేరు దుర్గయ్య... వీన్ని పాలేరుంచుకోండ్రి..."

దుర్గయ్యను ఎగాదిగా చూశాడు వెంకటయ్య.

"గీ పోరడేం పని జేత్తడురా...?" అన్నాడు.

"ఎందుకు సెయ్యడు పటేల...! పెండకల్లు దీత్తాడు...ఎడ్లగాసుకత్తడు... గడ్డి కోసుకొత్తడు... నాగలి దుంతడు... మా ఇండ్లల్ల ఈనీడు పిల్లగాండ్లు అన్ని పనులు జేత్తరు... మాకు పన్జెయ్యకుంటె ఎట్లెల్లుతది పటేల...? మీకు కాళ్లు గూడొత్తుతడు..."

"సరె... వాన్నిక్కడుంచిపో... జీత మెంతియ్యమంటవు...?"

"నెల కిరుస మక్క లియ్యండ్రి..."

"అది వాజ్బే కని నువ్వు మక్కలు కొల్సుకపెయినంక నీ బాకెట్ల తీరుతది చెప్పు...? అందుకోసం వీన్ని బట్ట పొట్టకు ఇంట్లనే ఉంచుకుంట... బాకి పైసలు ఎప్పుడు కడితె అప్పుడు తీసుక పో... వాటికి మిత్తిలేదు... వీనికి జీతం లేదు... గిదీని కొప్పుకుంటన్నావా...?" అన్నాడు వెంకటయ్య.

"సరే పటేలా...! మీ రన్నట్లే కానియ్యండ్రి... కాని... కాని..." అని చెప్పడానికి జంకుతున్నాడు వీరయ్య...

"ఏందిరా...? ఏం గావన్నో చెప్పు..." అన్నాడు వెంకటయ్య.

"ఏం లేదు పటేలా...? ఇంకొక్క యాభై రూపాయలిప్పియ్యండ్రి... బాగెక్కరుంది..."

"అశ బాగనే ఉందిరో..." అని యాభై వీరయ్య చేతిలో పెట్టి కాగితంపై వేలిముద్ర వేయించుకున్నాడు వెంకటయ్య.

"దుర్గన్నా... నువ్వు పటేలింట్లుండి, ఏ పని జెప్పుతె అది చెయ్యి" అని వెనుదిరిగి పోబోయాడు వీరయ్య...

"నాయన్నా! నేను పటేలింట్లుండనే... మనింటికే అత్త..." తండ్రి చేయిపట్టుకొని విడువడంలేదు దుర్గయ్య...

"మనింట్లేముంది బిడ్డ...? కడుపు నిండ తిండన్న దొరుకకపాయె... ఈడుంటె తిండన్న కడుపునిండ తినొచ్చు... పని జేసుడెక్కడైనా తప్పది గద..." బుదరకించాడు వీరయ్య.

"ఏమొ్మపో... నాకీ బువ్వేమద్దు... మనింటికే అత్త..." అని హటంబెట్టసాగాడు దుర్గయ్య.

కొడుక్కు రకరకాలుగా నచ్చజెప్పి పటేలింట్లో ఉండేట్టు జేశాడు వీరయ్య...

అలా ఆ ఇంట్లో అడుగుపెట్టిన దుర్గయ్య త్వరలోనే ఇంట్లో వాళ్లందరికీ తలలో నాలుకయ్యాడు...పటేలుకు కాళ్లొత్తడం నుంచి మొదలుకొని అన్ని పనులూ చేసేవాడు. చలన్నమో, పాసిపోయిందో ఏది పెట్టినా తినేవాడు... పటేలింట్లో ఏది తిన్నా తన ఇంట్లో తిన్నట్టుగానే భావించేవాడు... దుర్గయ్య కంటే ఒకటి రెండేళ్లు పెద్ద, వెంకటయ్య కొడుకు లచ్చిరెడ్డి... అతనితో దోస్తీ కుదిరింది దుర్గయ్యకు...

వెంకటయ్య తండ్రి కాలంలో వడ్డీలకిచ్చి, తహసీలు కట్టలేనివాళ్ళ భూములకు తహసీలు కట్టి పట్వారి సాయంతో భూములను పెంచాడు. వెంకటయ్య కాలం వరకాతడు ఊరి ఆస్తిపరుల్లో ఒకడయ్యారు. అయితే డబ్బుండేవాళ్ళకుండే అన్ని గుణాలూ వెంకటయ్య కొచ్చాయి. విందులు...వినోదాలతో పాటు స్త్రీలతో అక్రమసంబంధాలూ అబ్బాయి... ఇంటినిండా ఎప్పుడూ జనమే. క్రమక్రమంగా ఆస్తులు కరగడం మొదలైంది... వెంకటయ్య మరణించేసరికి లచ్చిరెడ్డికి దాదాపిరవై ఏళ్లు... అతని మరణంతో కుటుంబం అసలు రంగు బయటపడింది. లక్షలకొద్దీ

అప్పులు మిగిలాయి... ఉన్న భూములన్నీ అమ్ముడుపోగా ఐదారెకరాలు మాత్రం మిగిలాయి... వెంకటయ్య కంటె ముందే దుర్గయ్య తండ్రి చనిపోయాడు... తల్లి చిన్నప్పుడే చనిపోయింది... అతనికి నా అనేవాళ్లెవరూ మిగలలేదు.

ఆరేడు నాగళ్ల వ్యవసాయం, లచ్చిరెడ్డి చేతికొచ్చేసరికి ఒంటె నాగలి వ్యవసాయ నికొచ్చింది... ఇంట్లో అంతకుముందుండే డాబు, దర్పమూ పోయాయి... లచ్చిరెడ్డి స్వయంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి వచ్చింది...

ఈ పదేళ్లలో దుర్గయ్యకా ఇంటితో విడదీయరాని అనుబంధమేర్పడింది. ఆ ఇంటిలోని ప్రతి అంగుళంతోనూ ఆత్మీయతేర్పడింది. వాళ్లకున్న భూములపై మమకార మేర్పడింది. అన్నిటికంటే ముఖ్యంగా వెంకటయ్య తననెలా చూసినా లచ్చిరెడ్డి మాత్రం తనను పాలేరులా కాకుండా తమ్ముడిగా చూసుకుంటున్నాడు అతనిపై అనురాగమేర్పడింది.

వెంకటయ్య చనిపోయి ఏడాది దాటింది. లచ్చిరెడ్డి దుర్గయ్యను దగ్గర కూచోబెట్టుకొని

"దుర్గయ్యా! మా నాన్నకాలంలో మా ఇంటి పరిస్థితి పైన పటారం లోన లొటారంలా ఉండేది. అయనున్నంతవరకూ ఇంటి పరిస్థితి బయటపడలేదు. ఇప్పుడు మా పరిస్థితి పాలేర్ల నుంచుకునే స్థితిలో లేదు. నేనిలా అంటున్నానని ఏమనుకోకు... నువ్విప్పుడు ఇంకెక్కడన్నా పనిచూసుకో, మీ నాన్న రాసిచ్చిన బాకీ కాగితం మొన్ననే నీ ముందటే చింపేసాను గద...!" అన్నాడు మెల్లగా...

ఆ మాటలు విన్న దుర్గయ్య తలపై పిడుగుపడ్డట్టయింది... ఊహ తెలిసినప్పట్నుంచీ ఆ ఇంట్లోనే ఉంటున్న దుర్గయ్యకు ఆ ఇల్లు తప్ప మిగతా ప్రపంచం అంతగా తెలియదు. పైగా లచ్చిరెడ్డి అతన్నెప్పుడూ పాలేరుగా కాకుండా ఇంట్లో మనిషిగానే చూశాడు. అప్పుడు చితికిపోతున్న లచ్చిరెడ్డిని వదిలిపోవడానికి సిద్ధంగా లేడు...

"పటేలా...! మీ సుఖాలల్ల మీతోనున్న... కష్టాలల్ల విడిచిపెట్టిపోను... నేనీ ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికీ పోను..." అన్నాడు దుర్గయ్య.

"అది కాదు దుర్గయ్యా! మేమే ఈ స్థితిలో ఉంటే?..." అన్నాడు లచ్చిరెడ్డి.

"నాకు మీరేం పెట్టున్నారు పటేల...! నేనేం బెట్టుమంటున్న... మీతోని కుండల గలదింత పెట్టుండ్రి... నాకింకేమద్దు..." అన్నాడు దుర్గయ్య...

"పెండ్లవీ చేసుకోవా దుర్గయ్యా...!"

"నాకు పిల్లనెవ్వలిత్తరు...? ఇచ్చినా నాకు పెండ్లెందుకు...?" అన్నాడు దుర్గయ్య... తర్వాతెన్ని సార్లడిగినా పెండ్లిపై ఆసక్తి చూపలేదు.

అలా ఆ ఇంట్లోని మనిషయ్యాడు దుర్గయ్య... తాను వేరే కుటుంబం నుంచి వచ్చినవాణ్ణని ఎప్పుడు అనుకోలేదు. లచ్చిరెడ్డి ఆర్థిక స్థితి అతని తండ్రి కాలంలోలా ఉంటే ఏం జరిగేదో తెలియదు. కాని ఆ కుటుంబంవాళ్ళెవరూ దుర్గయ్యను పరాయి మనిషి అనుకోలేదు... అతనికనారోగ్యంగా ఉన్నప్పుడూ వాళ్ళే అరుసుకున్నారు...

"నాకెందుకు పటేలా... ?" అంటున్నా వినకుండా తన ఇంటిపక్కనే

దుర్గయ్యకు ఒక చిన్న పెంకుటిల్లు కట్టించాడు లచ్చిరెడ్డి. దుర్గయ్య ఆ ఇంటిలో ఉన్నది తక్కువే...

లచ్చిరెడ్డి పిల్లలను దుర్గయ్య భుజాలపై ఎత్తుకొని తిప్పాడు... ఆడించాడు... పాడించాడు... తనవాళ్ళ లాగనే భావించాడు... ఆ పిల్లలు కూడా అతనిని "దుర్గన్న" అనే పిలిచారు గాని ఎప్పుడు పాలేరని కించపరచలేదు.

'మన పిల్లలను బాగా చదివించాలె' అనేవాడు లచ్చిరెడ్డితో దుర్గయ్య.

"వాళ్ళు చదవంది మనమేం చేద్దాం...?" అనేవాడు లచ్చిరెడ్డి.

"కష్టపడి చదివిద్దాం ..." అనేవాడు దుర్గయ్య...

ఏళ్లు గడిచాయి... లచ్చిరెడ్డి పిల్లలు పెద్దవాళ్ళయ్యారు... వాళ్లకూ పిల్లలయ్యారు... ఈలోగా ఊళ్లలో కొన్ని మార్పులొస్తున్నాయి. అలజడులు మొదలయ్యాయి. ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. వర్గాలు, అసమానతలు, దోపిడీ, వెట్టిచాకిరి, జీతాల పెంపు లాంటి పదాలు వాడుకలోకొచ్చాయి. ముఖ్యంగా యువకులు ఇలాంటి ఉద్యమాలకు చేయూతగానున్నారు. అందులో భాగంగానే దుర్గయ్యను లచ్చిరెడ్డి పనిమానుకొమ్మన్నారు. దుర్గయ్య మానుకోనన్నాడు.

మరికొన్నేళ్లు గడిచాయి. ఇప్పుడు దుర్గయ్యను వాళ్లు మరీ బలవంతం చేస్తున్నారు... అయినా దుర్గయ్య వినడం లేదు. దుర్గయ్య కిష్టం లేకున్నా పంచాయతన్నారు... తెల్లవారితే పంచాయతీ...

వెంకటయ్య ఇంట్లో చేరింది మొదలు దాదాపు యాభై ఏళ్ల జీవితాన్ని మననం చేసుకున్నాడు దుర్గయ్య. అర్ధరాత్రి దాటినా అతనికి నిద్రపట్టడం లేదు... యువకులు లచ్చిరెడ్డి నుండీ తనను వేరుచేయాలని చూస్తున్నారు. తమ మధ్యనున్న సంబంధాలను గుర్తించడం లేదు. తెల్లవారితే ఏమవుతుందో... అనుకున్నాడు దుర్గయ్య... తనకిష్టం లేనప్పుడు తలదీసి మొలేత్తరా... తనను తాను సమాధానపరుచుకున్నాడు... తెల్లవారుజామున నిద్రలో కొరిగాడు.

☆ ☆ ☆

తెల్లవారింది. అంబటివేళ దాటింది. పశువులన్నీ మేతకెళ్లాయి. శ్రమజీవులు తమ తమ పనుల్లో లీనమయ్యారు. కొందరు పాత పెద్ద మనుషులతోపాటు, ఈ మధ్య పంచాయతులు చేస్తున్న యువకులూ పంచాయతాఫీసు ముందున్న గద్దె దగ్గరికి చేరుకుంటున్నారు... ఖాళీగా ఉన్న చాలామంది దుర్గయ్య పంచాయతెలా జరుగుతుందో చూద్దామని అక్కడికొస్తున్నారు.

"ఎడ్డోడు దుర్గయ్య... ఏం చేస్తరో" అని కొందరనుకుంటుంటే, "దుర్గయ్యకే ఇష్టం లేకుంటే అల్లేం జేస్తరు... ?" అని కొందరునుకుంటున్నారు.

కొద్దిసేపట్లో అందరూ అక్కడికి చేరుకున్నారు. వేపచెట్టునానుకొని దుర్గయ్య నిల్చున్నాడు. అతని ముఖం మసిపూసిన కుండలా ఉంది. వెంట్రుకలు తెల్లబడుతున్నాయి... కాళ్లు పగుల్లుబట్టున్నాయి. అతని మొలకో దొడ్డు పంచుంది... శరీరంపై 'అపారం' అంగుంది. తలపై కుప్పిన పంచు రుమాలుంది.

అతని సమీపంలో లచ్చిరెడ్డి నిల్చొనున్నాడు... అతని ముఖంపై ముడతలున్నాయి. తలకు రుమాలుంది... దొడ్డు ధోతి, బనీను వేసుకొనున్నాడు లచ్చిరెడ్డి.

అందర్నీ చూసి సరాయించాడు సర్పంచ్.

"అందరొచ్చినట్టేనా...?" అన్నాడు.

"వచ్చినట్టే... పంచాయతీ కానిద్దాం..." అన్నాడు రామారావు.

"దుర్గయ్యా! నీ సంగతేంటో చెప్పు..." అన్నాడు రాజేశ్...

"ఏం జెప్పాలె...? ఇదువరకే ఎన్నోసార్లు చెప్పిన... మా పటేలు నాకేమన్యాయం సెయ్యలేదు... నేను పంచాయతీ గావన్నని మిమ్ముల్నడగలేదు... దిక్కుసక్కి లేనోన్ని నాకెందుకు గీ పంచాయితీ" అన్నాడు దుర్గయ్య.

"నీకు దిక్కు సక్కి లేదనే మేం పంచాయతీ పెడ్తన్నం... నువ్వద్దంటె సరిపో తుందా...? ఊళ్ళెగిన్ని మార్పులచ్చినా నువ్వింకా బానిసబతుకే బతుకుతనంటవు...?" అన్నాడు చంద్రమౌళి...

"బాంచె బతుకో, గీంచె బతుకో మీకేంది...? నా బతుకు నేను బతుకుతంటే నడుమ మీకేందంట...? మిమ్మల్నేమన్న బొట్టుపెట్టి పిలిసిన్నా..."

"అట్లంటే నడువది... నువ్వట్లాగు... లచ్చిరెడ్డీ... నువ్వు చెప్పు..." అన్నాడో యువకుడు.

"ఏం చెప్పాలే...? ఎన్నోసార్ల చెప్పిన... మేమేం రెడ్లు వెలుమల్లాగ అధికారం చలాయించినోల్లం కాము... మా బాపు కాలం సంగతి నాకు పెద్దగా జ్ఞాపకం లేదు కాని నేనైతే దుర్గయ్యను నా తమ్ముడిలాగే చూసుకున్న... దుర్గయ్య కూడా అంతే... మీ కెవర్ని చూసినా పాలేరు, యజమాని, దోపిడీ – ఇవే కనపడ్తుంటాయి. అందర్నీ ఒకే గాట కట్టడం మంచిది కాదు..." అన్నాడు లచ్చిరెడ్డి.

"రెడ్లు వెలమలంటున్నవు నీ పేరుగూడా లచ్చిరెడ్డేకదా...

"వీళ్ళు కాపులు... కాపు బలిస్తే రెడ్డన్నట్టు వీళ్ళ తండ్రికాలంలో మంచి స్థితిలో ఉన్నారు కాబట్టి రెడ్డని పెట్టారు" అన్నాడు రామారావు.

"మీలాంటివారు పాలేర్లకు తక్కువ జీతాలిచ్చి దోచుకున్నారు. బట్ట, పొట్ట పెట్టి దుర్గయ్యతో నింతకాలం చాకిరీ చేయించుకున్నారు."

"పాలేర్లకు తక్కువ జీతాలిచ్చింది నిజమే. కాని అదిప్పటి మాట కాదు. అప్పుడు కూడా మీకు పైకిచ్చిన జీతాలే కనబడ్తున్నాయి కాని మిగతావి కనబడటంలేదు. పొగాకు, గొంగడి, పాత బట్టలతో పాటు పండించిన పంటలోంచి ప్రతి వస్తువూ తీసుకెళ్ళేవారు. అవన్నీ లెక్కగడితే తక్కువేం గావు. ఆ విషయం పోనీయండి. దొరతనం సాగించుకున్న వాళ్ల సంగతి వదిలిపెడితే నాలాంటి వాళ్ళెప్పుడూ పాలేర్లను వేరుగా చూల్లేదు" అన్నాడు లచ్చిరెడ్డి.

"మాకు కథలు చెప్పకు, నువ్వు యజమానివి, దుర్గయ్య పాలేరు."

"మా నాన్న చనిపోయింతర్వాతే చాలించుకొమ్మన్నాను. దుర్గయ్య వినలేదు. పెళ్ళి చేస్తానన్నాను. చేసుకోలేదు. వద్దంటున్నా చిన్న ఇల్లు కట్టించాను. నేనెప్పుడూ

దుర్గయ్యమీద యజమానిగా ప్రవర్తించలేదు. మేమనారోగ్యంగా ఉన్నప్పుడు దుర్గయ్య మమ్మల్నరుసుకుంటే, అతనికే అనారోగ్యమైనా మేమరుసుకున్నాం. దుర్గయ్య కంటెక్కువే నేనూ వ్యవసాయప్పనులు చేసాను. మా ఇంటి వాళ్ళంతా చేసారు. నా ఒక్క, కుటుంబమేంటి. ..? నాలాంటి చిన్న వ్యవసాయాలున్న వాళ్ళెవరూ ఒళ్ళు దాచుకోరు... కొందరు వెళ్ళక ఒకరిద్దర్ని పాలేరుంచుకున్నా వాళ్ళను పాలేర్లుగా చూసేవాళ్ళు తక్కువ..."

"చెప్పడానికి బాగానే ఉంటుంది. నువ్వు ఘటికుడివి..."

"మీరెప్పుడూ ఒక్క దిక్కునుంచే చూస్తారు. వ్యవసాయాలు చేసి, పాలేర్ల నుంచి మేమెన్ని బంగ్లాలు కట్టామో చూపించండి... ఎన్నాస్తులు సంపాదించామో చెప్పండి... ఈ భూమిని దున్నుకుంటూ బతుకుడు కాదనే నా కొడుకులిద్దరు పొట్ట చేతితో పట్టుకొని బొగ్గుబాయి పనికిపోయారు. పాలేరును పెట్టుకొన్న ప్రతివాడూ మీకు దొర, దోపిడీదారుగానే కనపడతాడు. ఇప్పుడెన్ని వ్యవసాయాలు మూలకు పడ్డయో మీరు గమనిస్తూనే ఉన్నారు. ఇంతకీ దుర్గయ్య నానుంచేం కోరుకుంటున్నాడో అడగండి. అతడు చెప్పింది చేయడానికి నేను సిద్ధమే" అన్నాడు లచ్చిరెడ్డి.

"దుర్గయ్యా! నీకు పటేలన్యాయం చేసిండని పదుసోల్లంటండ్రు... నీకు న్యాయం చేస్తానంటండ్రు. నీకేం కావాలో కోరుకో..." అన్నాడు మచ్చయ్య.

"వేరేవాళ్ళ సంగతి నాకు తెలువది కని లచ్చిరెడ్డి పటేలు నాకు తోడబుట్టిన అన్నసోంటోడే. అయినె కొడుకులు నా సేతులనే పెరిగిండ్లు. అల్ల లగ్గాలు నేనే సేసిన. నాకు తల్లిదండ్రెవ్వలు లేరు. నేనా ఇంట్ల మనిషినే. ఆ భూమిని కూడ నా భూమే అనుకున్న. ఎవ్వలులేని నా కాళ్ళే చుట్టాలు. నన్ను అల్ల భూముల్నే కాలేస్తరు. పటేలు కొడుకులే నన్ను తండ్రిని దానం చేసినట్టు దానం చేస్తరు. నాకేమద్దు" అన్నాడు దుర్గయ్య.

"ఛట్, నీయవ్వ... నీ బాంచెబతుకు పాడుగాను. ముసలిగాడిది కొడుక... నువ్వు బతికిందో బతుకా...?" అన్నాడు చంద్రమౌళి.

"ఇగ మీరు సెప్పేదే బతుకువటు... మీకు పటేలు, పాలేరు గివ్వే కనవడ్తున్నయి కని ఊళ్ళె ఉన్న సంబంధాలు, ప్రేమలు కనబడుతలెవ్వు. కనపడ్డా మీరు సూడరు... మీకంతా ఒక్క తీరుగనే కనపడ్తది. మీవి పచ్చకామిండ్ల కండ్లు..." అన్నాడు దుర్గయ్య.

"అతనికే వద్దనుంటె, అలా బతకడమే ఇష్టమయితే పంచాయతెందుకు...? మనకెందుకీ ఆరాటం...?" అన్నాడు సర్పంచ్.

"అదే పొరపాటు... దుర్గయ్యకేం కావాలో అతనికే తెలియదు. యాభై ఏండ్లనుంచి బాకీ బతుకు బతికి బతికి ఆలోచనే లేకుండా అయిపోయింది... పటేలుకు సేవ చేయటమే జీవిత మనుకుంటున్నాడు... అతడన్నంత మాత్రాన మన మూర్ఖునేది లేదు..." అన్నాడు రాజేశం.

"ఊకోకేం సేత్తరు...? నాకేమొ తెలువదట... ఈల్లకేమొ బాగా తెలుసట. ఎంటికె పీకిత్తె కాసేదో మొదలేదో తెలువది మీకు. ఊళ్ళె దొరతనముండె...

దోపిడుండె... వెట్టి చాకిర్లుండె... నిజమే... గవ్వన్ని చాలావరకు పోయినయి... గదీ నిజమే... మీరు గివ్వీట్నే సూత్తంద్రు... కాని, మునుపు ఊళ్ళె ఒక్కల కార్యంలొక్కల ఎంత మంచిగ సాయం చేసుకునెటోల్లు? ఒకల అవసరాలల్ల ఒకలు ఎట్ల అరుసుకునెటోల్లు...? అక్కెరుండి ఏ రాత్తిరి ఇంటికి పెయినా పైసలు దొరికేటియి... ఇంటికచ్చినోల్లను పానమోలె చూసుకునెటోల్లు... మరిప్పుడు...? అన్ని నాశినమైతన్నయి... ఒగల్నొగలు పట్టించుకోకుంటైతంద్రు...భూములిడిసి పట్నాలెంబడి పోతంద్రు... నాశినెంజెయ్యింద్రి... లచ్చిరెడ్డి పటేల సోంటిన్ని, చిన్న ఎవుసదార్ల ఎంబడికూడ పడి ఎవులను నాశినెం జెయ్యింద్రి..." ఆవేదనతో, ఆక్రోశంతో అన్నాడు దుర్గయ్య.

ఆ మాటలు విన్న అందరూ నోళ్ళు తెరిచారు.

కొద్దిసేపెవరేం మాట్లాడలేదు.

"ఇప్పుడేం చేద్దామో చెప్పండ్రి..." అన్నాడు మాజీ పట్వారి.

"ఇన్ని రోజులు చాకిరీ చేయించుకున్నందుకు దుర్గయ్యకు రెండు లక్షల రూపాయలివ్వాలి లచ్చిరెడ్డి..." అన్నాడు చంద్రమౌళి.

"అవును... అవును..." అన్నారు యువకులంతా.

"ఏ మంటావోయ్ లచ్చిరెడ్డి...?" అడిగాడు సర్పంచ్. విరక్తిగా నవ్వాడు లచ్చిరెడ్డి...

"భేషుగుంది మీ తీర్పు" సరే... దుర్గయ్య ఒక్కడు నా భూమిలో పని చేసినందుకు నేను రెండు లక్షలివ్వాలి. మరి మా ఇంటోల్లమంతా ఆ భూమిలోనే పని చేశాం... నాకు ఎనిమిది లక్షలిచ్చి నా ఆస్తి నంతా తీసేసుకోండి... పోనీ, నా ఒక్కని కూలే దుర్గయ్యకులా లెక్కగట్టి రెండు లక్షలిచ్చి ఉన్నదంతా తీసుకోండి. నా కూలిపోతున్నిల్లును, నాలుగెకరాల భూమిని మీకే ఇస్త. ఆ డబ్బులియ్యండ్రి..."

లచ్చిరెడ్డి మాటలు విని ఆశ్చర్యపోయారు వాళ్ళు... మాట్లాడటానికింకేం కనబడలేదు వాళ్ళకు.

"ఎవరికేం ఇచ్చేది లేదు. లచ్చిరెడ్డి కూడా చిన్నరైతే... అయితే దుర్గయ్యను లచ్చిరెడ్డి ఇంట్లో ఉండనివ్వద్దు..." అన్నాడో యువకుడు.

ఆ యువకుని మాటల నందరూ ఒప్పుకున్నారు. దుర్గయ్యకు మాత్రమది భరింపరానిదిగా ఉంది. లచ్చిరెడ్డికీ ఆ తీర్పు అశనిపాతంగానే ఉంది.

తమదారి తమదే తప్ప తమ మధ్యగల సంబంధాల నర్థం చేసుకోని యువకులపై కోపంగా ఉన్నా నిస్సహాయంగా నిల్చున్నారు వాళ్లు.

ఇద్దరు యువకులొచ్చి దుర్గయ్య "వద్దు వద్దు" అని మొత్తుకుంటున్నా చేయిపట్టుకొని తీసుకుపోతున్నారు. లచ్చిరెడ్డి దిక్కు దీనంగా చూస్తున్నాడు దుర్గయ్య. అయినా వాళ్ళు లాక్కుపోతూనే ఉన్నారు.

ఆ దృశ్యం ఆవునుండి లేగదూడను దూరంగా లాక్కుపోతున్నట్లుగా ఉంది. వాళ్ళ మధ్యగల అనుబంధాలను బలవంతంగా తెంపివేసినట్టుగా ఉంది.

"నేను రాను రాను ... లచ్చిరెడ్డి పటేలుతోనే ఉంట..." అని మొత్తుకున్నా ఎవరూ విన్నవాళ్ళు లేరు. కొంత దూరం పోయి ఇక లాభం లేదనుకొని రెండు చేతుల్తో బలంగా విదిలించి విడిపించుకున్నాడు దుర్గయ్య.

"ఎవర్రా, నన్ను నా అన్న నుంచి దూరం చేస్తనన్నది! నన్ను పాలేర నుంర్రి... బానిసనుంర్రి... ఇంకేదన్నానుంర్రి... నేనా ఇంట్ల నుంచి రాను. నేనక్కన్నే పెరిగిన... యాభయేండ్లక్కన్నే గడిపినా... నా పాన మక్కన్నే పోతది. నన్నేం జేత్తరో సెయ్యుంర్రి..." అని లచ్చిరెడ్డి ఇంటి దిక్కు పరుగులు తీస్తున్నాడు దుర్గయ్య.

ఇక దుర్గయ్యకేం చెప్పి లాభం లేదనుకున్నారు వాళ్ళు... "పోనీయ్ మన కేంటి...? దుర్గయ్యకు బాకీ బతుకు బతకడమే ఇష్టమయితే బతుకనీయి... బాకీ చావే చావనియ్..." అన్నాడో యువకుడు.

"అవును, దుర్గయ్యది బాకీ బతుకే... దుర్గయ్య డొక్కందే కాదు... లచ్చిరెడ్డిది కూడా. వాళ్ళిద్దరూ ఒకరికొకరు బాకీ పడున్నారు. అందుకే విడిపోవడం వాళ్ళ కిష్టంలేదు. వాళిద్దరివీ బాకీ బతుకులే..." అన్నాడు అంతవరకేమీ మాట్లాడకుండా కూర్చొనున్న ఆ ఊరి రిటైర్డ్ టీచర్ రామచంద్రం...

● *ఆదివారం ఆంధ్రప్రభ, 3-3-96* ●

★ ★ ★